కథ




# వలీమా

• శశిశ్రీ

రంగు రంగుల లెటింగ్ సరాలు సందు పొడవున కట్టడంతో ఆ వీధంతా వెలుగుల తోరణమైంది. హిందీ పాటలు మైకులో హోరెత్తి దద్దరిల్లింపజేస్తున్నాయి.

ఆ తోరణం మొదలులో... ఇంటి ఆవరణ దగ్గర నెత్తికి టోపి... మొహానికి అతికించిన తళుకులు, మెడలో గులాబీల దండతో మహారాజ ఛేర్‌లో కూర్చున్న కొత్త పెళ్ళికొడుకు – టీ సత్తార్ వింత అందగాడిలా కనిపిస్తున్నాడు.

వలీమా 'పేర్తో' జరిగే రిసెప్షన్‌కు నెమ్మదిగా ఒకొక్కరు వస్తున్నారు. మూడు వందల ఆహ్వాన పత్రికలు ఓపికగా తిరిగి పంచిన సత్తార్ దాదాపు అందరూ స్పందించి తప్పక వస్తారని ఆశతో ఎదురు చూస్తున్నాడు.

అతను కూర్చున్న వేదికకు అటు ఇటు రెండు వరుసల్లో వేసిన కుర్చీలవైపు పరిశీలనగా చూశాడు. యాభై మంది దాక వున్నారు. ఇంకో యాభై కుర్చీలు ఖాళీగా వున్నాయ్.

అతని ముందున్న టేబుల్‌పై అయిదు పూల దండలు వున్నాయ్. టైం పావుతక్కువ ఎనిమిది అయింది. ఊర్లో ఈరోజే రెండు మూడు పెళ్ళిళ్ళు, వలీమాలు వున్నాయ్. ఆహ్వానించిన వాళ్ళు వేరే వలీమాలకు పోతే... ఈ ఆలచోన రాగానే కొద్దిగా చెమటలు పట్టాయి సత్తార్‌కు.

జేబురుమాల తీసి - మొహం తుడుచుకొంటూ అల్లాను మనసులో తల్చుకున్నాడు - ఆహ్వానించిన అందరూ తప్పక రావాలని... వచ్చిన ప్రతి ఒకళ్ళు వందేసి రూపాయలు తక్కువ కాకుండా చదివింపులు ఇవ్వాలని మనసులో ఇప్పటికి ఆరవ సారి అనుకున్నాడు.

అక్కడికి వచ్చిన యాభైమంది ఏమైనా చదివింపులు కానిచ్చారా అంటే దాదాపు ఏమీలేదు. రావడం పెళ్ళికొడుకుని ఆలింగించుకొని, శుభాకాంక్షలు చెప్పి - ''వడ్డిస్తాం, రమ్మంటే'' వెళ్ళి ఓ పట్టుపట్టడానికి రెడీగా కూర్చుని వున్నారు. ఈ లెక్కన అందరూ వుత్తి చేతుల్తో వస్తే తనగతేం కాను? మాంసం ఇచ్చిన కసాబ్ కరీంసాబ్‌కు, బియ్యం అప్పు ఇచ్చిన జమాల్ సాబ్‌కు, పెళ్ళిబట్టల ఖరీదులో సగం అప్పు - సగం నగదు ఇచ్చిన సలామ్ సేట్‌కు ఏమివ్వగలడు?

వస్తున్న వారితో ఆశగా చెయ్యి కలిపి వచ్చినందుకు కృతజ్ఞతలు చెతున్నాడే కానీ, చదివింపుల గురించి ఎవరూ సీరియస్‌గా లేకపోవడంతో సత్తార్ పరిస్థితి యమ సీరియస్‌గా మారింది.

మూడు వందల మందికి ఆహ్వాన పత్రికలు ఇవ్వాలని ఆలోచించి, ఆలోచించి కొంచెం పెద్ద తరహా వాళ్ళకు - చదివింపులకు ఢోకా లేని వాళ్ళకే పంచిపెట్టాడు. మూడు వందల మందిలో వంద మంది వుత్తచేతుల్తో వచ్చి తినిపోయినా, మిగిలిన రెండు వందలమంది మనిషికి సగటున నూరు రూపాయలు చదివింపులుగా పెట్టే సరి... ఇరవై వేలు లెక్కపెట్టుకోవచ్చు!!

ఆ ఇరవై వేలతో మాంసం వానికి, పచారివానికి, బట్టల షాపువానికి ఎడమచేత్తో చకచకా నోట్లు ఎంచి ఇచ్చేస్తాననుకున్నాడు. ఆవిధంగా బకాయిలు ఇచ్చేసినా ఇంకా అయిదారు వేలు మిగులుతుందనుకున్నాడు. అలా ఆలోచిస్తుంటే... సత్తార్‌కు చిన్నప్పుడు విన్న కథ గుర్తుకొచ్చింది.

వెనుకటికి ఒకనికి కోడిగుడ్డు దొరుకుతుంది. దాన్ని పొదగడం, కోడిపిల్ల కావడం, అది పెద్దదై... చిన్నగా కోళ్ళఫారమ్మై, ఫారాలై, క్రమంగా మేకలై, ఆవులై, గుర్రాలై, ఏనుగులై... ఇంక రాజ్యం జయించి రాజు కాబోయే క్షణంలో చేజారి ఆ గుడ్డు కాస్త కిందపడిపోతుంది. ఊహించిందంతా గాల్లో కలిసిపోతుంది.

ఇప్పుడు రావల్సిన చదివింపుల సంగతి కూడా ఇంతేనా!? ఆ ఆలోచనల్లో వుండగానే ఎదురుగా కటిక కరీంసాబ్ ప్రత్యక్షమయ్యాడు. చేతిలో పెద్ద పూలమాలతో... ఆ దండకు ఇరవై రూపాయలు నోట్లు కుట్టించి మరీ తీసుకునిరావడం సత్తార్ గమనించాడు. ప్రాణానికి ఎంతో హాయి అనిపించిందతనికి.

కరీంసాబ్ పూలమాల వేసి - వీడియోలో దిగి - సత్తార్ పక్కన ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

అప్పుడు గుర్తుకొచ్చింది సత్తార్‌కు... వలీమా కోసం పొద్దున మాంసం అప్పుగా ఇచ్చినప్పుడే కరీంసాబ్ ఖరాఖండిగా చెప్పేశాడు. వలీమా చదివింపులు తానే కూర్చుని రాబట్టుకొని - అప్పు బాపతు పోగా మిగిలింది పూలల్లో పెట్టి అక్కడే ఎంచి ఇచ్చేస్తానని - అలా అయితేనే మాంసం ఇస్తాను. లేకుంటే లేదన్నాడు. సరే ఆ మాట మీదనే తెచ్చుకుని వలీమా పలావ్ చేయించాడు సత్తార్.

అప్పటివరకు వచ్చిన చదివింపులు 'పేర్లతో' పాటుగా వివరాలు రాసి వుంచిన నోటు పుస్తకాన్ని - పూలదండల కిందనుండి తీసి కటిక కరీంసాబు చేతికందించాడు.

మాట పొల్లుపోకుండా సత్యహరిశ్చంద్రునికంటే గొప్ప ఫోజులో నోటు బుక్కు అందించిన సత్తార్ నిజాయితీని ప్రశంసాపూర్వకంగా చూస్తూ అందుకున్నాడు.

పుస్తకాన్నందించిన సత్తార్ మొహంలో ఏ భావమూ లేదు. మాజీ ప్రధానిలా నిర్లిప్తంగా వున్నాడు.

మొహంపై చిరునవ్వు మొలిపించుకున్న కరీంసాబు - పెన్నుపెట్టి వున్న దగ్గర పుస్తకాన్ని తెరిచాడు.

మూడు పేర్లున్నాయ్.

1) కిరసనాయిలు ఫకరుద్దీన్ - రూ.50/-లు
2) బేల్దారి మాబుసా - రూ.20/- లు
3) టీ ఆకు గౌస్ మొహిద్దీన్ - శాలువ.

మొహంలోంచి చిరునవ్వు ఎప్పుడు గాల్లో కలిసిపోయిందో పోయింది. ఆ స్థానంలో అమావాస్య చీకటి అలుముకుంది. చిరుకోపం - ముక్కుపుటల్నించి వేడి నిట్టూర్పుగా బయటికి తన్నుకొచ్చింది.

'ఏం... ఇంతేనా...!??? అన్నట్టుగా చూశాడు సత్తార్‌కేసి కరీంసాబు. ఇక్కడికిక్కడే పొట్టేలి గొంతును కత్తిపెట్టి పరపరా కోసేలా వున్నాడు. ఆ పొట్టేలు ఎవరో కాదు సాక్షాత్తు సత్తారే అనిపించింది. కటికాయన పరిస్థితిని వెంటనే కనుగొన్నాడు. ఆలస్యం చేయకుండా -

''ఇంకా ఒక్క బంతి కూడా కూర్చోలేదు కరీంసాబు! చిన్నంగా ఒకొక్కరు వస్తార్లే... నీవు పోయి ఈ మొదటి బంతిలోనే కూర్చుని తినేసిరాపో... ఈలోపల ఎవరన్న వస్తే వచ్చిన చదివింపులు వచ్చినట్లు కరెక్టుగా రాసి పెట్తాన్లే'' నమ్మకంగా చెప్పాడు.



పెండ్లి కూతురి తరపు పెద్దాయన ఒకరు వచ్చి - 'అతిథులు వచ్చి చాలాసేపే అవుతోంది నాయనా! భోజనాలు ప్రారంభిస్తే బాగుంటుంది'' సలహా ఇచ్చాడు.

''ఆ.. అలాగే హజరత్! కానివ్వండి' అనుమతిస్తూ...

మారుపలకకున్న కరీంసాబు కేసి -

''నీవు పోయి తినివచ్చి కూర్చో కరీంసాబు!'' అన్నాడు సత్తార్.

''ప్చ్... వద్దు నేను వేరే వలీమాలో తిని అక్కడ రావాల్సిన డబ్బులు తీసుకొని, ఇంక నీ దగ్గర చూసుకొందామని వచ్చాను. ఇక్కడ చూస్తే ఏం బాగలేదే...'' ఏం చెప్పాలో దిక్కుతోచక మనసులో మాట పైకనేశాడు.

''బాధపడకు కరీంసాబు - మూడు వందల పత్రికలు మాంచోళ్ళకు ఏరి మరీ ఇచ్చాను. మొదటి బంతి తిని లేయ్‌ని చూడు. అంతా ఒకరిపై ఒకరు వచ్చేస్తారనిపిస్తోంది'' అన్నాడు ఆశగా.

''నాకు మాత్రం ఆవిధంగా తోచడం లేదు. ఊర్లో పెద్ద పెళ్ళిళ్లు వున్నాయ్. అంతా అక్కడికి పోయివుంటారు. కాదని వచ్చినా చదివింపుల క్రింద డబ్బులు యిచ్చేవాళ్ళు రారనిపిస్తోంది'' పశ్చాత్తాపపడుతున్నాడు.

''అధైర్యపడకు అన్నా! ఓపిక పట్టు. అంతా బాగానే జరుగుతుంది'' ఓదార్పుగా అన్నాడు.


పైకి కటికాయనకు ధైర్యం చెప్తున్నాడు కానీ, లోపల తనకు ఏదో కీడు తోస్తూనే వుంది.

ఇంతలో ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్ళు రుబాబుగా వచ్చారు.

పెళ్ళికొడుకు వంగి వంగి దండాలు పెట్టాడు. కటిక కరీంసాబు వినయంగా లేచి తలగోక్కున్నాడు. ''ఏంయా! మీకేమైనా బుద్ధివుందా లేదా మైకు ఇంత సౌండుతోనా పెట్టేది - పాండి స్టేషన్‌కు'' గదమాయింపుగా అన్నాడో కానిస్టేబుల్. అనుకోని విపత్తు ఎదురు కావడంతో సత్తార్ బిత్తరపోయాడు.

ఒకవైపు బకాయి రాబట్టుకోవడానికి కటిక కరీంసాబు గొంతుపై కూర్చున్నాడు. మరోవైపు పోలీసులతో కొత్త తలనొప్పి రావడంతో బిక్కచచ్చిపోయాడు. కరీంసాబు వెంటనే తేరుకుని - ఆపరేటర్‌ని మందలించాడు. పాటలతో హోరెత్తే మైకు పీక ఒక్కమారుగా నొక్కేయడంతో - వాతావరణం ప్రశాంతంగా మారింది. కరీంసాబే కలుగజేసుకుని వచ్చిన పోలీసు కానిస్టేబుళ్ళను ఎలాగైతేనేం శాంతపరిచాడు.

సర్లే ఓ క్యారియర్లో కొంచెం పలావు తెప్పించి



ఇవ్వు. అయ్య స్టేషన్లోనే వున్నాడు తొందరగా తీసుకెళ్తే తినేసి - ఇంటికి పోతాడు'' అన్నాడొక కానిస్టేబుల్.

''మీరిద్దరు ఈలోపల భోంచేయండి సార్. నేను క్యారియర్‌ని సార్‌కోసం రెడీ చేయి స్తా''నన్నాడు కరీంసాబు.

''అబ్బే ఎందుకులే.. ఇళ్ళకుపోతాం. క్యారియర్ తెప్పించు చాలు'' అన్నాడొక కానిస్టేబులు. తిన మని అడగాల్సింది కటిక కరీసా కాదుకదా.. పెళ్ళి కొడుకు అడగాల కానీ'' మనసులో అనుకున్నారు.

''అవున్సార్... మీరు ముందు భోంచేద్దురు పాండి! ఒరేయ్ షేక్‌షా సార్ వాళ్ళను తీసుకొనిపో'' సత్తార్ ప్రత్యేక మర్యాద చూపాడు.

మర్యాదకు మర్యాద, తిండికి తిండి లభించింది కదా అని ఆ కానిస్టేబుళ్ళు తలబుట్టలు తీసి భోజనాల దగ్గరికి నడిచారు.

''క్యారియర్ పంపడమే దండగ. మళ్ళీ ఈ ఇద్దర్నీ భోజనాలకు ఎందుకు పిలిచావ్ అన్నా!'' ప్రశ్నించాడు సత్తార్.

''పోలీసోళ్ళు స్వామి వాళ్ళు. రేపు నిన్నూ నన్నూ ఏ కేసులోనైనా ఇరికించవచ్చు'' అన్నాడు కరీంసాబు.

విలన్లు కూడా అప్పడప్పుడు హీరోలైపోతారంటే ఇదేనేమో. ఏదిఏమైనా పోలీసోళ్ళబారిన పడకుండా కాపాడగలిగాడు కరీంసాబ్ అనుకున్నాడు సత్తార్.

ఇందాక భోజనాలకు అనుమతి తీసుకున్న పెద్దాయన కనిపిస్తే పిలిచాడు. అతనికి చెప్పి, ఇంట్లోంచి పెప్సి బాటిలు తెప్పించి - ''కరీంసాబు! భోంచేయమంటే అస్సలు కాదంటున్నావ్. పోనీ ఈ పెప్సీ అయినా తాగు'' అంటూ అందించాడు.

శుభమా అని పెండ్లిచేసుకొని - మచ్చుటకొద్ది వేడుక జరుపుకొంటుంటే ఈ వలీమ రోజున బియ్యంవానికి కాబట్టనిది, పచారివానికి కాబట్టనిది ఈ బద్మాష్ కటికోనికే బకాయి ఎందుకు గుర్తొచ్చినట్లు?

సవాలక్ష రమ్మని చెప్పివుండవచ్చులే. సిగ్గు శరమూ లేకుండా వచ్చేయడమేనా!? నిజంగా ఇంత కర్కోటకుడని తెల్సివుంటే మాంసం జోలికే పోకుండ పలావ్ బదులు ఖుష్కా - దాల్చాతో సరిపెట్టేసి వుందునుకదా. ప్చ... అంతా కర్మ! కర్మ! కర్మ!.. మనసులో అనుకోసాగాడు సత్తార్.

పెప్సీ తాగుతున్న కరీంసాబు మొహంలోకి చూశాడు.

బాగా బల్సిన గడ్డం మేకపోతులా కనిపించాడు సత్తార్ కళ్ళకు.

ఇంతలో కూరగాయల మార్కెట్టు నుండి దండు తరలివచ్చింది. ఉన్న కుర్చీలు నిండిపోయి చోటు దొరక్క - క్రిక్కిరిసి నించున్నారు.

వాళ్ళ దిక్కు విస్మయంగా చూశాడు సత్తార్.

వాళ్ళకేసే అనుమానంగా చూశాడు కరీంసాబు.

వాళ్ళను ఎవరు రమ్మన్నారో ఇద్దరికీ అర్థం కాలేదు. ఒకరి మొహాలు ఒకరు చూసుకొన్నారు.

ఈలోగా మొదటిబంతి భోజనాలు పూర్తయ్యాయి.

కడుపునిండా భోంచేసి బయటకి వచ్చిన పోలీసు కానిస్టేబుళ్ళు నమస్కారాలు ఇచ్చిపుచ్చుకొని - రెడీగా వున్న టిఫిన్ క్యారియర్‌తో బరువుగా వెళ్ళిపోయారు.

బిలబిలమంటూ భోజనాల వైపు దూసుకెళ్ళింది దండు. కొందరు చేతపట్టుకొచ్చిన పూలదండలను పెళ్ళికుమారుడు సత్తార్ మెడలో వేసి అభినందించారు. అలా అభినందించి - భోజనాలకు పోతున్న ఒకరిద్దర్ని ఉద్దేశించి -

''మీరు ఎవరి తరపున వచ్చారో తెలుసుకోవచ్చునా!'' అని అడిగేశాడు కరీంసాబు.

''ఎవరో ఎందుకు పిలుస్తారు బాబు! సాక్షాత్తు అమ్మాయి వైపు వాళ్ళు మరీ మరీ పిలిస్తేనే కదా వచ్చాం' అన్నాడొకడు.

వలీమాకు వారం రోజుల ముందే సత్తార్, పెళ్ళికూతురి తరపు వాళ్ళను గట్టిగానే అడిగాడు. వలీమాకు అమ్మాయి వైపు నుండి భోజనాలకు

> డబ్బుకు మొహంవాచినవాళ్ళకు
> నూరు అన్నా మహాగొప్పే!
> రాజకీయ వ్యవహారాల్లో
> తలమునకలుగా వుండే వీళ్ళకు
> అయిదొందల నోటు పెద్ద
> లెక్కలోనిది కానేకాదు.

ఎందరు వస్తారని - చెప్పిన దానినిబట్టే భోజనాలు చేస్తానన్నాడు.

అందుకు అమ్మాయి వాళ్ళు - మావైపు నించి ఎందరో ఎందుకు వస్తారు? ముఖ్యమైన వాళ్ళు తప్ప ఇతరుల్ని పిలవలేదు. మీరు నిశ్చింతగా వుండొచ్చు అని నమ్మబలికారు.

కానీ, ఈ రోజు దండు దండే కదిలివచ్చింది.

రెండవ బంతి భోజనాలు కూడా అయిపోయాయి.

మూడవ బంతి భోజనాలు మొదలయ్యాయి.

సత్తార్ ఎంతో నమ్మకంగా ఎదురుచూసిన వాళ్ళల్లోంచి - చదివింపులు ఇచ్చుకునే స్థితిస్థాయి వున్నవాళ్ళు పదిమంది వచ్చారు. తలో పార్శిలు తెచ్చారు.

చదివింపుల పుస్తకంలో పేర్లు రాయించుకుని పెళ్ళి కుమారుడ్ని అభినందించి భోజలనాలకోసం వెయిటింగ్‌గా కుర్చీల్లో కూలబడ్డారు.

పిలిచినవాళ్లు జట్లుజట్లుగా రావడం మొదలైంది. ఇంక చదివింపుల ప్రవాహం ప్రారంభం అనుకున్నాడు సత్తార్.

ఇంతలోనే రెండు సుమోలు వచ్చి ఆగాయి.

ఆ సుమో బండ్లనుండి ఇరవైమంది దాకా దిగారు. ఇద్దరు గన్‌మ్యాన్లతోపాటు ప్రతిపక్ష పార్టీ టవున్ లీడర్ కుమార్‌రెడ్డి మీసం మెలితిప్పుతూ రిసప్షన్ స్టేజి దగ్గరకు వచ్చాడు.

అతన్ని చూస్తూనే సత్తార్ మొహం సంతోషంతో విప్పారింది. హైదరాబాదుకు పోకపోతే వస్తానని చెప్పిన టవున్ లీడర్ రావడం తృప్తిగా అనిపించింది. పైగా వీధిలో, టవున్లో తనకు ప్రిస్టేజి ఎంతగా పెరిగిపోతుందోనని మురిసిపోయాడు.

ఆయన వెంట వచ్చినవాళ్ళు చదివింపులు కచ్చితంగా సమర్పించుకునేలా వున్నారు. కడక్ గంజి బట్టల్లో కళకళలాడిపోతున్నారు. అయిదేసి వందల రూపాయలు ఇచ్చినా పెద్ద ఆశ్చర్యం ఏముంది? డబ్బుకు మొహంవాచినవాళ్ళకు నూరు అన్నా మహాగొప్పే! రాజకీయ వ్యవహారాల్లో తలమునకలుగా వుండే వీళ్ళకు అయిదొందల నోటు పెద్ద లెక్కలోనిది కానేకాదు. ఇలా మనసులో ధారాళంగా వూహించేశాడు సత్తార్.

కుమార్‌రెడ్డి చెయ్యి కలిపి, అభినందించి - వీడియోలో దిగి - వెయిటింగ్‌గా కుర్చీలో హుందాగా కూర్చున్నాడు. డిన్నర్‌కు వచ్చినవారికి కుమార్‌రెడ్డి సెంటర్ అట్రాక్షన్‌గా మారాడు.

మూడో బంతి భోజనాల్ని స్పీడుగా కానిచ్చాడు సత్తార్.

నాల్గో బంతి మొదలుపెట్టి - కుమార్‌రెడ్డితో పాటు లోపలికెళ్ళి - మర్యాదలు జరిపి వచ్చి కూర్చున్నాడు సత్తార్.

మొదటిసారి సత్తార్‌కు తనపై తనకే జాలేసింది. లేకుంటే ఏందిది? అప్పుచేసి పప్పుకూడు బదులుగా పలావు కూడు చేస్తే - ఫ్రీ సర్వీసు గిరాకీలే అన్నీ అయిపోయినాయి కానీ, కాసులు రాల్చే మగోడు కలికానికి కూడా రాకపోవడం దౌర్భాగ్యం అనుకొన్నాడు.

తన ప్రక్కన సరిసమానంగా కటిక కరీసాబు కుర్చీలో కూర్చోవడం సత్తార్‌కు మింగుడుపడడం లేదు. ఏదో ఫ్రెండ్లీగా కూర్చోనివుంటే ఆ పరిస్థితి వేరు. బకాయి వసూలు చేయడానికి - పైగా ఇలా - ఈ శుభకార్యం రోజున వచ్చి కూర్చోవడం అసలు జీర్ణించుకోలేకపోతున్నాడు.

కరీంసాబు వచ్చి భుజాలపై కూర్చున్నట్లే వుందతనికి. వేలాడే కత్తికింద క్షణంక్షణం భయంగా వుందతనికి.

నా బ్రతుకులో ఇలానే రాసి వుందేమోనని తన్ను తాను ఓదార్చుకున్నాడు.

తన పెళ్ళి పందిరి కిందకు ఉన్నపళంగా మరో పెళ్ళికొడుకు ప్రత్యక్షమయ్యాడు. ఆయనకు తోడుగా నలుగురు పెద్దమనుషులు వున్నారు.

సత్తార్‌కు ఏం దిక్కుతోచడం లేదు. వలీమాలో పెళ్ళికొడుకు తానేకదా అని అనుమానించి - అందులో ఏ అనుమానమూ అక్కరలేదని నిర్ధారించుకొని - ఉన్నట్టుండి ఊడిపడిన సదరు మరో పెండ్లికుమారునికేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

ఆ వచ్చిన పెండ్లికొడుకు సత్తార్ అవస్థను

గ్రహించేసి - సరాసరి విషయంలోకి దిగేశాడు. ''అన్నా క్షమించు! నేను సైకిల్‌షాపు మొదీన్ కొడుకు గౌస్‌భాషాను. మనది ప్రక్కన జెండామాను వీధే. నువ్వు నాకు బాగా తెల్సులే...'' అతని ఆ కొద్దిపాటి పరిచయాన్ని కూడా భరించలేక అతని మాటల్ని మధ్యలోనే ఆపేశాడు సత్తార్.

''చూడు గౌస్‌భాషా! అసలు విషయానికి వచ్చేయ్. ఇప్పుడే అంతా గందరగోళంగా వుంది'' అన్నాడు సత్తార్.

''సరేన్నా! మరి మార్కెట్టు నుండి వచ్చినారే వీళ్ళంతా ప్రక్కవీధికి రాకుండా పొరపాటుపడి ఇక్కడికి వచ్చేసినారు. ఎంతకూ రాకపోయేసరికి మార్కెట్టుకు ఫోన్‌చేస్తే... బయల్దేరి గంట సేపయిందన్నారు. తీరా విచారిస్తే ఇక్కడ తేలినారు'' అన్నాడు గౌస్‌బాషా.

''ఆ.. అదా కథ!! ఈ మార్కెట్టు దండు అంతా మీ గిరాకీలా! మంచిపని చేసినారయ్యా మీవాళ్ళు! ఇప్పుడు నిజంగా మేం పిలిచిన వాళ్ళు వస్తే మాగతేంకాను. పిలిచి - భోజనం పెట్టలేదనిపించుకోమంటారా!?'' ఆందోళనగా అన్నాడు కరీంసాబు.

సత్తార్ ఏదో అనబోతుంటే వారించాడు వచ్చిన మరో పెళ్ళికొడుకు.

జరిగిందానికి సిగ్గుపడుతున్నాను. అలాగని మీరు పిలిచిన వాళ్ళ ముందర మిమ్మల్ని నగుబాటు కానివ్వను మా దగ్గర పలావు చేయించిన డేక్షాలు నిండుగా వున్నాయి. ఎత్తి ఇక్కడికి పంపిస్తా... మీరేం బాధపడకండి'' పరిష్కారంగా అని అక్కడి నుండి తన మనుషులతో పాటుగా వెళ్ళాడు.

జరిగే సంఘటనల్ని ఉత్తమ ప్రేక్షకునిలా సత్తార్ చూడగల్గుతున్నాడు. ఏదీ తన ప్రమేయంతో లేనట్లుందనుకున్నాడు.

ఈ అయోమయంలో కుమార్‌రెడ్డితోపాటు వచ్చిన జనం - వచ్చిన సుమోల్లో ఎక్కి వెళ్ళిపోయారు.

''సినిమా కష్టాలు అంటే ఏందో అనుకునేవాణ్ణి! ఈరోజు నీ వలీమాలో దానర్థం తెల్సింది'' జరిగిన సంఘటనలపై వ్యాఖ్యానం చేశాడు కరీంసాబు.

''అది డబ్బులిచ్చి చూసే సినిమా కరీంసాబ్! ఇది జీవితం! బ్రతుకులిచ్చి చూసే సినిమా! ఆ 3 గంటల సినిమాకు ముగింపు ఏంటో తెల్సిపోతుంది. ఈ వలీమాకు ఎండింగ్ ఏందో దిక్కుతోచి చావడంలేదు'' తాత్వికంగా అన్నాడు.

''శుభం పలకరా పెండ్లికొడకా అంటే తత్వాలు పలుకుతావేంటి సత్తారు. కష్టాలు మనుషులకు కాక చెట్లకు వస్తాయా! అవి వచ్చినప్పుడే కదా ధైర్యంగా ఎదుర్కోవాల'' సముదాయింపుగా అన్నాడు.

''ధైర్యం లేకేమి? దండిగా వుంది! నీ బకాయి భూతం నన్ను పట్టింది. దాని దెబ్బకే కదా వూగిపోతున్నాను'' అని మనసులో అనుకున్నాడు.

అరబ్బు సేటులా వున్న యువకుడు టిప్పుటాపుగా మోటార్ సైకిలుపై రిసెప్షన్ వేదిక దగ్గరకు వచ్చాడు. ఆయనతోపాటు సత్తార్‌కు ముఖ పరిచయం మాత్రమే వున్న యువకుడు వున్నాడు.

రావడం రావడం సరాసరి సత్తార్ ఎదురుగా వచ్చి కళ్ళలో సూటిగా చూస్తూ ... ''సత్తార్‌భాయ్! అల్సలామ్ వాలేకుమ్'' గౌరవవందనం హుందాగా తెలియజేశాడు.

''వాలేకుమ్ అల్సలామ్'' గౌరవ ప్రతివందనం యాంత్రికంగా చెప్పాడే కానీ, ఆ వచ్చిన ఆగంతకుడు ఎవరో గుర్తుకురాక, పాలుపోక నించుండిపోయాడు.

''నేను ఎవరో గుర్తుపట్టావా!?'' ఏకవచనంలోకి దిగేసి ప్రశ్నించాడు.

''క్షమించండి! మిమ్మల్ని పోల్చుకోలేకపోతున్నాను'' తన అవస్థను ఎరుకపరిచాడు.

''ఇప్పుడు చెప్పుకో చూద్దాం'' కళ్ళజోడు తీసేసి - దగ్గరగా వచ్చి మొహంలో మొహం పెట్టి ప్రశ్నించాడు.

''క్షమించండి! మిమ్మల్ని గుర్తుపట్టలేకపోతున్నందుకు సిగ్గేస్తోంది! మీరే దయచేసి చెప్పండి...''

తన జ్ఞాపకశక్తిని మనసులోనే నిందించుకోసాగాడు. ''హా.. నేన్రా... నీ చిననాటి స్నేహితుణ్ణి! రహిమాన్‌ను'' అని గట్టిగా నవ్వేశాడు.

''ఓహ్! నువ్వట్రా! ఎంతగా మారిపోయావు. సన్నగా జెండా మానులా వుండేవాడివి. ఇప్పుడు బాగా జబర్‌దస్త్‌గా తయారయ్యావు. పైగా గడ్డం పెంచావు'' అతని మాటల్ని మధ్యలోనే ఆపేశాడు ఆగంతకుడు.

> **నేను వృత్తికోసం కసాయిపని చేస్తున్నానే కానీ, మనుషుల్ని పశువులుగా భావించే కర్కోటకుడిని మాత్రం కాను. నీకు తెలుసా! నీవూ - నాబోటి పేదాసాదా మనిషివే! ఆ విషయం తెలిసే నీకు అప్పు ఇచ్చాను.**

హమ్మయ్యా చివరికి గుర్తించావ్! రా, సంప్రదాయబద్ధంగా ఓమారు హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలుపనీ'' అన్నాడు.

సత్తార్ - రహిమాన్ ఇద్దరు గౌరవ ఆలింగనాలు చేసుకున్నారు.

రహిమాన్ తన జేబునుండి చిన్న పెట్టె బయటకుతీసి, మూత విప్పాడు. లోపల ధగధగ మెరిసే ఉంగరం. దాన్ని చేతిలోకి తీసుకొని - సత్తార్ కుడిచేతి చిటికిన వ్రేలి ప్రక్కవేలికి తొడిగాడు. సరిగ్గా సరిపోయింది.

ఇదంతా అలా జరిగిపోయింది. ఆశ్చర్యానికి గురికావడం సత్తార్, కరీంసాబు వంతు అయ్యింది.

ఆ క్షణం సత్తార్ మనసులో మెదిలిన ఆలోచన ఒకటే ఒకటి. ఈ ఉంగరం కటిక కరీంసాబు చేతిలోపెట్టి - అమ్ముకుని బాకీలోకి జమవేసుకోమని చెప్పాలనుకున్నాడు. చివరి దశలో ఇలా



ఉంగరం రూపంలో సమస్య పరిష్కారం కాబోతుం డడం వూరట అన్పించింది సత్తార్‌కు.

చిననాటి మిత్రుని పెళ్ళి వుందని తెలుసుకొని - ఎలాటి పెండ్లి పిలుపు లేకపోయనా - రావడం - రావడమే కాకుండా ఖరీదైన అరబ్బుల ఉంగరం బహూకరించడం కటిక కరీంసాబు ప్రేక్షకునిలా గమనిస్తున్నాడు.

రహిమాన్‌తో సత్తార్ వీడియోలో దిగి, ప్రత్యేకంగా ఫోటోలు దిగి ఆయన్ను భోంచేయించి సాదరంగా సాగనంపాడు.

రహిమాన్ వెళ్ళిపోయాక సాలోచనగా కటిక కరీంసాబువైపు చూశాడు.

కరీంసాబు మొహంలో ఏ భావమూ లేదు.

తనకు తొడిగిన ఉంగరాన్ని సత్తార్ చేతిలోకి తీసుకొని - కరీంసాబుకు అందించబోయాడు.

''ఏమిటి ఇదంతా!?'' ఆశ్చర్యాన్ని ప్రకటించాడు కరీంసాబు.

''మరేం లేదు. డబ్బు ఇవ్వలేకపోతున్నాను. దయతో ఉంగరం దగ్గరపెట్టు. రేపు బజారులో అమ్మేసుకుని బాకీలో జమవేసుకొందువుకాని. ఇలా ఉంగరం ఇస్తున్నందుకు మరేం అనుకోకు'' చాలా వినయంగా అన్నాడు.

కరీంసాబు కళ్ళలో వున్నపళంగా సర్రున నీటి చక్రాలు గింగిర్లు తిరిగాయి. ఊపిరి తీసుకోవడం బరువుగా తోచింది. ఈ అవస్థ నుండి తేరుకొని -

''సత్తార్! నిజం చెప్పు!! నేను నీ కళ్ళకు ఎలా అగుపిస్తున్నాను'' ప్రశ్నించాడు.

''ఏం అన్నా! ఎందుకలా అడిగావు!?''

''మరేంలేదు. నేను వృత్తికోసం కసాయిపని చేస్తున్నానే కానీ, మనుషుల్ని పశువులుగా భావించే కర్కోటకుడిని మాత్రం కాను. ఈ ఉంగరం నీ వేలిలో వుండటమే శుభకరం! బాకీ సంగతి సరే! డబ్బుగా చదివింపులు వచ్చివుంటే తప్పక తీసుకొని వుందును. రానిదానికి నీవు బాధ్యునివి కావు... నీకు తెలుసా! నీవూ - నాబోటి పేదాసాదా మనిషివే! ఆ విషయం తెలిసే నీకు అప్పు ఇచ్చాను. అన్నట్టు నేను వేరే వలీమాలో భోంచేసిరాలేదు. నీతోపాటు భోంచేద్దాం అని వచ్చాను'' మనసులో మాటను స్పష్టంగా తెలియజేశాడు.

సత్తార్ అంతవరకు ఆలోచిస్తున్న ఆలోచించిన తీరుకు సిగ్గుపడిపోయాడు. ఆపుకుందామనుకున్నప్పటికీ కన్నీరు ఆగింది కాదు. ఏదో చెప్పబోయాడు సత్తార్ - ఆపేశాడు కరీంసాబు.

''ఇక మాటలు చాలు! నాకు ఆకలి దంచేస్తోంది. పద ఇంత కడుపుకు వేసుకుందాం'' అన్నాడు.

ఇద్దరు పాలమనసులతో భోంచేయడానికి లేచారు.

★